## క్లుప్తంగా

### అయ్యప్ప స్వామికి క్షీరాధివాసములు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డు ఐశ్వర్యనగర్లో హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో పరివార దేవత సహిత అయ్యప్పస్వామి 27వ ప్రతిష్ఠ దిన, అష్టబంధన మహా సంప్రోక్షణ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశం కేశవాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పరాంకుశ చక్రవర్తి, రంగస్వామి, సమీర్ సాయంత్రం ఆరు గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, అష్టబంధనం, స్వామివార్లకు పంచగవ్య, క్షీరాధివాసములు, ఆధివాస హోమాలు, మూర్తి హోమాలు, చతుర్వేద పారాయణం, నివేదన, హారతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు.

### చర్చి నిర్మాణానికి మారం ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: దేవరపాలెం క్రిస్టియన్‌పాలెంలో చర్చి నిర్మాణానికి వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి బుధవారం రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. స్థానిక క్రైస్తవ భక్తుల విజ్ఞప్తి మేరకు చర్చి నిర్మాణానికి చీమకుర్తిలోని తన నివాసంలో మారం వెంకారెడ్డి ఫౌండేషన్ ద్వారా నగదు అందించినట్లు వెంకారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్‌తో పాటు స్థానిక భక్తులు వెంకారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, బొంతా ఏసుదాస్, పాస్టర్ అబ్రహమ్, భక్తులు పాల్గొన్నారు.

### ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పొలం పట్టాలు పంపిణీ



పొలం పట్టాలు అందిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

చీమకుర్తి: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చీమల మర్రి ఎస్సీకాలనీ వాసులకు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు చేతుల మీదుగా బుధవారం పొలం పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక గ్రామస్తులకు గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికి 50 సెంట్ల చొప్పున 36 మంది లబ్ధిదారులకు ఇచ్చిన పొలాలకు వారి భూములను రిజిస్ట్రేషన్ చేసుకునే హక్కు కల్పిస్తూ ఒరిజినల్ పట్టాలను ఎస్సీ కార్పొరేషన్ అధికారుల ద్వారా అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు అత్యాల కౌశిక్, జడ సుగుణరావు, జడ రాజు, అత్యాల అంకయ్య పాల్గొన్నారు.

### వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

నాగులుప్పలపాడు: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఎంపీడీవో మహాలక్ష్మి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరు, అమ్మనబ్రోలు, తిమ్మసముద్రం గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్లకు నోటిఫికేషన్ జారీ చేయడంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు.

# జగనన్న అవసరం మనందరికీ ఉంది



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున



వలంటీర్లకు సేవా పురస్కారాలు అందిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

- పేద ప్రజల గుండె చప్పుడు.. జగన్
- అర్హతే ప్రామాణికంగా రూ.2.60 లక్షల కోట్లను సంక్షేమ పథకాల ద్వారా అందించారు
- మంత్రి మేరుగు నాగార్జున
- తక్కెళ్లపాడులో సచివాలయాల ప్రారంభం, 113 మంది వలంటీర్లకు పురస్కారాల అందజేత

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు రూ.2.60 లక్షల కోట్ల విలువ చేసే సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా కులమతాలు, పార్టీలకతీతంగా పేద ప్రజలకు అందించారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేరుగు నాగార్జున అన్నారు. దేశచరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా పేదలకు అందించనన్ని సంక్షేమ పథకాలను మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అందించారన్నారు. అందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఆయన కన్నా రాష్ట్రంలోని పేదప్రజలకే అవసరమన్నారు. బుధవారం రాత్రి సంతనూతలపాడు మండలం తక్కెళ్లపాడులో రూ.80 లక్షల విలువ చేసే సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యకేంద్ర భవనాన్ని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి నిరంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ పేద ప్రజల గుండెచప్పుడైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. చంద్రబాబు పాలనలో పేదలకు చేసిన సంక్షేమం ఏమీ లేదన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను గెలిపించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం తక్కెళ్లపాడు, ఎనికపాడు, గుమ్మనంపాడు, మద్దులూరు, వేములపాడు, బొడ్డువారిపాలెం, చిలకపాడు గ్రామాల సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 113 మంది వలంటీర్లకు సేవా పురస్కారాలను మంత్రి మేరుగు నాగార్జున చేతుల మీదుగా అందించి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ ఆలూరి సుశీల, ఆలూరి వెంకటేశ్వర్లు, దుంపా యలమందారెడ్డి, బొల్లినేని కృష్ణయ్య, స్థానిక గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మహిళలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న బాలినేని శచీదేవి

# అడుగడుగునా ఆదరణ.. ఆప్యాయత

- బాలినేని శచీదేవి పర్యటనకు విశేష స్పందన

ఒంగోలు: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి ప్రారంభించిన ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది. బుధవారం స్థానిక మంగమూరు రోడ్డులో మోర్ మార్కెట్‌కు ఎదురు రోడ్డులో మహిళలతో మమేకం-స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ దాకా సుజాత హనుమారెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాళ్లతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల గురించి వివరిస్తూ వాస్తవాలను బేరీజు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజానీకం మాట్లాడుతూ విమర్శలలో వాస్తవాలు ఏమిటో గమనించే శక్తి నేడు ప్రజలకు వచ్చిందన్నారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. నగర అభివృద్ధికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేస్తున్న కృషిని ప్రతిఒక్కరూ హర్షిస్తున్నారన్నారు. పట్టణాన్ని కార్పొరేషన్‌గా మార్చడం, శివారు ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పన, నగరంలో ఆహ్లాదకర వాతావరణం, తదితరాలను గుర్తుచేశారు. బీసీ కులాల ఆరామ క్షేత్రాలకు స్థలాలను కేటాయించడం ద్వారా ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో నివాసం ఉండే ఎంతోమంది పడే వేదనలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్ల నిర్మాణం కూడా అక్కడ జరగాలన్నా, లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన జరగాలన్నా బాలినేని తిరిగి ఎమ్మెల్యే అయితేనే సాధ్యపడుతుందని ప్రతిఒక్కరూ భావిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బాలినేని శచీదేవి మాట్లాడుతూ ప్రజల ఆలోచనలో మార్పు రావడం ద్వారా మాత్రమే విమర్శలను తిప్పికొట్టడం సాధ్యపడుతుందన్నారు. ఇటువంటి మార్పును ప్రతిఒక్కరూ ఆహ్వానించాలని, ప్రజల్లో మరింత మార్పుకు చదువుకున్నవారు కృషిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. శచీదేవి వెంట వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, హనుమంతునిపాడు ఎంపీపీ సావిత్రి, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జిల్లెళ్లమూడి రమాదేవి, తూము పద్మ, లక్ష్మీకుమారి, సాధం విజయలక్ష్మి, అంజలి, వాణి తదితరులు ఉన్నారు.

# ఘనంగా మాతృభాషా దినోత్సవం



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సభ్యత్వంతో విద్యార్థినులు



మూగబోయిన వేణుగానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముస్లిం రచయితల సంఘ ప్రతినిధులు



డీఎస్ ప్రభుత్వ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కళ్యాణి



మాట్లాడుతున్న జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ శ్యాంసునీల్



కొత్తపట్నంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఒంగోలు: నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో స్థానిక జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ కె.శ్యాంసునీల్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరి 21వ తేదీ ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషా పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించాలని 1999లో యునెస్కో ప్రకటించిందన్నారు. మాతృభాషను పరిరక్షించుకునే బాధ్యత మన అందరిదని, తల్లి భాషలో ఉన్న తీయదనం మరో భాషలో మనకు కనిపించదని అన్నారు. మాతృభాష సహజంగా అబ్బుతుందని, అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషను కూడా కాపాడుకోవాలని అన్నారు. భావితరాలకు మాతృభాష గొప్పతనం, తియ్యదనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రపంచ ప్రాచీన భాషలో తెలుగు భాషను కూడా గుర్తించడం జరిగిందని, తేనెకన్నా తీయనైన మాతృభాషను సంరక్షించుకుని భవిష్యత్ తరాలకు మార్గదర్శకం కావాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ అధికారి డి.రాజేంద్రప్రసాద్, ఆఫీస్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎం.నాగమల్లేశ్వరి, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు. ఆధునిక యుగంలో తెలుగు భాషా ప్రాముఖ్యత అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో విజేతలైన వారికి బహుమతులు అందించారు.

**స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో...**

స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ మాతృభాషా ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష ఎంతో గర్వకారణమని, ప్రతి విద్యార్థి తెలుగులో మాట్లాడటం, స్పష్టంగా రాయడం నేర్చుకుని నేటి తరానికి రేపటి పౌరులుగా నిలబడాలని అన్నారు. ఏకేయూ ఈసీ మెంబర్ డాక్టర్ కేవీ పద్మావతి, తెలుగు అధ్యాపకురాలు పి.యామినీ అమ్మాజీ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.కుసుమకుమారి, డాక్టర్ జి.ధనుంజయరావు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

**జిల్లా కేంద్ర గ్రంథాలయంలో...**

ఒంగోలు టౌన్: మాతృభాష తల్లిలా స్వచ్ఛమైన ప్రేమను పంచుతుందని, మనుషుల్లో మమకారాన్ని పెంచుతుందని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. పేరయ్య ఆర్థిక సహాయంతో పట్టణంలోని బండ్లమిట్ట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు గ్రంథాలయ సభ్యత్వం అందజేశారు. గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ఉప గ్రంథాలయ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, జీవీ శివారెడ్డి, ఎ.ప్రసాద్, టి.గోవిందమ్మ, కె.సంపూర్ణమ్మ, ఎం.శ్రీనివాసులు, ఎస్.అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో...**

ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక కోట వీధిలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ముస్లిం రచయితల సంఘ అధ్యక్షుడు షేక్ మహబూబ్‌జాన్ రచించిన మూగబోయిన వేణుగానం రాధాకృష్ణుల ప్రణయగాథ పుస్తకాన్ని ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు ఆవిష్కరించి ప్రసంగించారు. రచయిత షేక్ మహబూబ్ జాన్, గాయకుడు బ్రహ్మయ్య, ఓరుగంటి ప్రసాద్, జి.జానకీరాం, రాఘవాచారి, షేక్ హుమాయున్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపట్నంలో...**

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి అధ్యక్షత వహించారు. కవి, రచయిత, విశ్రాంత ఉద్యోగస్తుడు పిన్ని వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవగా, ఎర్రన, గురజాడ చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావు గీసిన తెలుగు కవులు, రచయితల చిత్రపటాలను విద్యార్థుల ముందు ప్రదర్శించిన సందర్భంగా ఆయనను హెచ్‌ఎం అభినందించారు. తెలుగు ఉపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు, సీనియర్ తెలుగు ఉపాధ్యాయురాలు ధనజ్యోతి మాట్లాడుతూ కవులు, కవయిత్రుల గురించి వివరించారు. కార్యక్రమంలో సెక్రటరీ హరిబాబు, పర్రె వెంకట్రావు, శరత్‌బాబు, కృష్ణమూర్తి, పద్మశ్రీ, ఉమామహేశ్వరి, ఉష, రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధ్యానంతో మానసిక ప్రశాంతత



అవగాహన కలిగిస్తున్న మెడిటేషన్ ట్రైనర్ శ్రీరామచంద్రమూర్తి

ఒంగోలు: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మెడిటేషన్ ట్రైనర్ టి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. బుధవారం స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్, రాగ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సంయుక్తంగా డిప్లొమా విద్యార్థులకు మెడిటేషన్ ఆవశ్యకత గురించి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ నేటి సమాజం పరుగుల ప్రపంచంగా మారిందన్నారు. అందువల్ల అనేక మానసిక సమస్యలు వస్తున్నాయన్నారు. తద్వారా మనుషులు ఆనందమైన జీవితాన్ని పొందలేకపోతున్నారన్నారు. ఇలాంటి ఇబ్బందుల నుంచి బయటపడాలంటే ప్రతి మనిషి రోజుకు కనీసం 10 నుంచి 20 నిముషాలు ప్రశాంతంగా కూర్చుని ఏకాగ్రత పాటించాలన్నారు. ఆహారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శాకాహార పదార్థాల వల్ల ఉపయోగాలు, ఎమోషనల్ బ్యాలెన్స్, మెమరీ పవర్ పెంపొందించుకోవడం ఎలా అనే అంశాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మెడిటేషన్ సాధన చేయించడంతో పాటు విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సమాధానమిచ్చారు. విద్యార్థులు మెడిటేషన్ ఆవశ్యకతను గుర్తించి జీవితంలో దానిని ఆచరిస్తూ మానసిక ఆరోగ్యాన్ని చేకూర్చుకుంటూ మంచి స్థానానికి చేరుకోవాలని కాలేజీ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు పేర్కొన్నారు. రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, మెంటల్ హెల్త్ రీసెర్చి ప్రతినిధులు ఆలపాటి ప్రశాంతి, ఆలపాటి హిమశ్రీ, రైజ్ గ్రూప్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జేవీ రమేష్‌బాబు, పాలిటెక్నిక్ కాలేజీ రాగా కో ఆర్డినేటర్ కె.స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ నాయకులకు సత్కారం



పోకూరి రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న జేఏసీ నాయకులు



పేరం శ్రీనివాసరావును సత్కరిస్తున్న జేఏసీ నాయకులు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించబడిన పోకూరి రామకృష్ణారెడ్డి, ఎస్టీ సెల్ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావును బుధవారం చీమకుర్తిలోని వారి నివాసాల వద్ద అణగారిన కులాల ఐక్యవేదిక (జేఏసీ), మార్కండేయ యువజన సంఘం ఆధ్వర్యంలో పూలమాలలతో సత్కరించారు. చింతకింది అశోక్, షేక్ ఖాదర్‌బాషా, కడవ రామకృష్ణ, ఇస్తర్ల శంకర్, ఆంజనేయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

మద్దిపాడు: ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో వచ్చి కులం పేరుతో బూతులు తిడుతూ తనపై, తన కుటుంబ సభ్యులపై దాడి చేశారంటూ అన్నంగి గ్రామం ఎస్టీకాలనీకి చెందిన కోలా రమాదేవి మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కుంచాల హరికృష్ణ అతని తండ్రి ఏడుకొండలు, భార్యతో కలిసి వచ్చి తమ కుటుంబ సభ్యులు వేటకు వెళ్లిన సమయంలో ఇంటిపై దాడి చేసి కులం పేరుతో బూతులు తిట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన మరిది మురళి వచ్చి అడ్డుపడినా అతనిని కూడా తిడుతూ నెట్టివేశారన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మరుసటి రోజు కూడా ఇంటిపైకి వచ్చి మాపైనే ఫిర్యాదు చేసేంతటి మగోళ్లా మీరు..మీ అంతు చూస్తామంటూ బెదిరించినట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై హరికృష్ణ, అతని తండ్రి, భార్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మైనర్ ప్రేమికులు తల్లిదండ్రులకు అప్పగింత



మైనర్ ప్రేమికులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఒంగోలు రైల్వే పోలీసులు

ఒంగోలు టౌన్: పెళ్లి చేసుకుందామని తిరుపతి బయలుదేరిన మైనర్ ప్రేమికులను మార్గం మధ్యలో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలుడు (15), ఒక మైనర్ బాలిక (15) ఒకే స్కూల్లో చదువుకునేవారు. ఇద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారింది. ఇంట్లో పెద్దలకు చెబితే ఒప్పుకోరని, తిరుపతి వెళ్లి పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. బుధవారం రాత్రి తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో నుంచి పారిపోయారు. రాజమండ్రి చేరుకున్న ఈ జంట.. బస్సులో ఒంగోలు చేరుకున్నారు. అప్పటికే వారు తెచ్చుకున్న డబ్బులు అయిపోయాయి. రైలులో తిరుపతి వెళ్లి పెళ్లి చేసుకుందామని, కుదరకపోతే ఇద్దరూ కలిసి చనిపోదామని నిర్ణయించుకుని ఒంగోలు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా తనిఖీలు చేస్తున్న రైల్వే సీఐ ఎస్.శ్రీకాంత్‌బాబు దృష్టిలో పడ్డారు. అనుమానం వచ్చిన ఆయన.. వారిని ప్రశ్నించగా తొలుత సమాధానం చెప్పేందుకు ఇష్టపడలేదు. కాసేపటి తర్వాత దారికి వచ్చి అసలు విషయం చెప్పారు. వెంటనే వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఉండ్రాజవరం పోలీసు స్టేషన్‌లో బాలిక మిస్సింగ్ కేసు నమోదై ఉందని తెలియడంతో అక్కడి పోలీసులకు తెలియజేశారు. ఉండ్రాజవరం ఎస్సై అప్పలరాజు తన సిబ్బందిని, వారి తల్లిదండ్రులను ఒంగోలు పంపించారు. దీంతో వారిని తల్లిదండ్రులకు అప్పగించగా సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

## 24న సామూహిక సత్యన్నారాయణ వ్రతం

కొత్తపట్నం:

కొత్తపట్నంలో ఎండోమెంట్‌కు సంబంధించిన ఆదికేశస్వామి దేవస్థానంలో వేంచేసియున్న శ్రీ సత్యనారాయణస్వామికి ఈ నెల 24న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కూరపాటి వెంకటసుబ్బారావు, ఆలపాటి సత్యనారాయణ, తాతా జనార్దనరావు, బొమ్మిశెట్టి వెంకట సురేష్‌బాబు తెలిపారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు సూరాకనకవల్లి అమ్మ ట్రస్ట్ చెన్నై, గ్రామస్తుల సహకారంతో పూజా సామగ్రి, భోజన వసతులు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం కోరారు.

# పేదల ఆరోగ్యం కోసమే జగనన్న సురక్ష

- నగర మేయర్ గంగాడ సుజాత



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: నిరుపేద, మధ్య తరగతి, సామాన్య ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. నగరంలోని చెరువుకొమ్ముపాలెం డివిజన్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్న మేయర్.. ప్రజలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె ప్రసంగిస్తూ... నిరుపేదల ఆరోగ్యాన్ని ఇంటి పెద్ద కొడుకులా ఒక బాధ్యతగా జగనన్న తీసుకున్నారని చెప్పారు. అందుకే గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా నిరుపేదల కోసం ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇంతకు ముందు మన రాష్ట్రాన్ని పరిపాలించిన ప్రభుత్వాలు ఇంటివద్దకే వైద్య సేవలను ఎందుకు అందించలేకపోయాయో ప్రజలు ప్రశ్నించాలని కోరారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు సంతోషంగా ఉంటాయన్న లక్ష్యంతోనే ఆరోగ్య సురక్ష పథకాన్ని జగనన్న అమలు చేస్తున్నారని తెలిపారు. కేవలం వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా ప్రతిఒక్కరి ఆరోగ్య వివరాలను రికార్డు చేసి ఎప్పుడు అవసరమైతే అప్పుడు చికిత్స అందించేలా డిజిటలైజేషన్ చేస్తున్నారని చెప్పారు. గతంలో ఆరోగ్య శ్రీ ద్వారా 5 లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్య సేవలను పొందే అవకాశం ఉండేదని, ఇప్పుడు 25 లక్షల వరకు వైద్య సేవలను అందించేందుకు పరిమితి పెంచారని వివరించారు. చేతిలో డబ్బు లేకపోవడం వలన చికిత్స చేయించుకోలేని దుస్థితి ఉండకూడదన్న మంచి ఉద్దేశంతో జగనన్న ప్రభుత్వం ఉందన్నారు. నిరంతరం పేద ప్రజల బాగు కోసం తపించే జగనన్నకు ప్రతిఒక్కరూ అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు వైద్య చికిత్సలు చేయించుకున్నారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులిచ్చారు. కార్యక్రమంలో వెంగముక్కలపాలెం యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఖాశీంవలి, సిబ్బంది పాల్గొన్నారు.